# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 128 | శనివారం 10, జనవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



విలేకరులు కావలెను
ప్రజాస్వరం
పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.
సెల్ : 800 860 9999




# జలవివాదాలు పరిష్కరించుకుందాం

రాజకీయాలకతీతంగా చర్చించుకుందాం
కోర్టుల బాట పట్టకుండా అవగాహన కుదుర్చుకుందాం
మేం నీటి సమస్యలను రాజకీయ ఆయుధం చేసుకోవాలనుకోవడం లేదు
పంచాయితీలు వద్దు.. తెలంగాణకు నీళ్లే కావాలి
తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ కావాలంటూ ఏపీ సహకరారం అవసరం
ప్రపంచదేశాలతో తెలంగాణ రాష్ట్రం పోటీ పడుతోంది
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రజాస్వరం

రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ తెలంగాణను సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి కోర్టుల బాట పట్టకుండా, పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జల వివాదాల అంశంపై స్పందిస్తూ--- నీళ్ల సమస్యను రాజకీయ ప్రయోజనాల కోసం తమ ప్రభుత్వం ఎప్పుడూ ఉపయోగించుకోలేదని, భవిష్యత్తులోనూ అలా చేయబోమని స్పష్టం చేశారు. "పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా అంటే పరిష్కారమే కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకోవాలి" అని సీఎం అన్నారు. ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా నదిపై నిర్మితమైన ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల విషయంలో అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల కారణంగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం ..మిగతా 2లో

# రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం

జగన్ భూమి పత్రాలపై తన ఫొటో ఎందుకు పెట్టుకున్నారో అర్థం కాదు
భూమిపై హక్కు ఎప్పటికీ రైతులదే.. ప్రభుత్వానిది కాదు
అందుకే తాము రాజముద్రతో పట్టా పాసుపుస్తకాలు ఇస్తున్నాం
పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రైతుల కష్టాలు తీరుతాయి
రైతుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు
పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు

హైదరాబాద్, ప్రజాస్వరం

కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతులు వెనుకడుగు వేయకుండా పనిచేసి రాష్ట్ర ప్రజలందరికీ అన్నం పెట్టారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో ఆయన పర్యటించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.గత ప్రభుత్వ హయాంలో రైతుల భూమి పత్రాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఎందుకు వేశారో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. భూమి రైతులదే.. ప్రభుత్వాలది కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నేతల ఆలోచనలు ప్రమాదకరమైనవని వ్యాఖ్యానించారు. 'మీ భూమి - మీ హక్కు' అనే నినాదంతోనే ఎన్నికల ప్రచారంలోకి వెళ్లామని గుర్తు చేశారు. భూమి పత్రాలపై రాజముద్రతో పాసుపుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చామని,

..మిగతా 2లో




# ముగిసిన తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు

రికార్డు స్థాయిలో దర్శనాలు.. వివరాలు వెల్లడించిన టీటీడీ
7.83 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం
10 రోజుల్లో రూ.41 కోట్ల హుండీ ఆదాయం, 44 లక్షల లడ్డూల విక్రయం
టీటీడీ ఏర్పాట్లపై 93 శాతం భక్తులు పూర్తి సంతృప్తి
ఏఐ కమాండ్ కంట్రోల్ రూమ్‌తో క్యూలైన్ల పర్యవేక్షణ



02

# కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌లా వ్యవహరిస్తోంది

ఉర్దూ వర్సిటీ భూములపై కన్నేసింది
విద్యాసంస్థల భూములే ప్రభుత్వ లక్ష్యం
గతంలోనే భూములను ఆక్రమించే యత్నం చేసింది
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ప్రజాస్వరం

కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌లా వ్యవహరిస్తోందని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఉర్దూ వర్సిటీకి చెందిన భూములపై ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో హైదరాబాద్ నందినగర్‌లో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. రాష్ట్రంలో విద్యా సంస్థల భూములే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం భూములు లాక్కోవడం ఇదే మొదటిసారి కాదని కేటీఆర్ అన్నారు. గతంలో జయశంకర్ తెలంగాణ ..మిగతా 2లో



# డీజీపీ కి హైకోర్టులో ఊరట

నియామకాన్ని నిలిపివేయాలంటూ పిటిషన్
తదుపరి విచారణ వచ్చే నెల 5కు వాయిదా
ప్రభుత్వం తరపున సుదర్శన్ రెడ్డి వాదనలు

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన డీజీపీగా కొనసాగడాన్ని నిలిపివేయాలంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అయితే రెగ్యులర్ డీజీపీ నియామకానికి సంబంధించిన ప్రక్రియను మాత్రం నాలుగు వారాల్లో పూర్తి చేయాలని యూపీఎస్సీతో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది. డీజీపీగా శివధర్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త ధన్‌గోపాల్

..మిగతా 2లో

# ఈడీ తీరుపై దీదీ ఆగ్రహం



కోల్‌కతాలో మమతా బెనర్జీ నిరసన
ఈడీ చర్యలు రాజ్యాంగ విరుద్ధం
ప్రతిపక్షాలను భయపెట్టేందుకు ఈడీ వాడుతున్నారు
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

హైదరాబాద్, ప్రజాస్వరం

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ శుక్రవారం కోల్‌కతాలో భారీ ఆందోళన చేపట్టారు. ఆమె నాయకత్వంలో నిర్వహించిన ఈ మెగా ర్యాలీకి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఐప్యాక్ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేపట్టిన సోదాలను నిరసిస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. కోల్‌కతాలో ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ సహా ఆ సంస్థకు చెందిన కార్యాలయాలపై ఈడీ

..మిగతా 2లో




# 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి భారీ షాక్
భద్రతా బలగాల ముందు లొంగిపోయిన 63 మంది మావోయిస్టులు
వీరిలో రూ.1.19 కోట్ల రివార్డులు ఉన్న 36 మంది
'పున మర్గం' ప్రచారంతోనే జనజీవన స్రవంతిలోకి
లొంగిపోయిన వారిలో కీలక డివిజనల్ కమిటీ సభ్యులు

03


www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM



## కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌లా వ్యవహరిస్తోంది

**మొదటిపేజీ తరువాయి**

నుంచి సుమారు 100 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుందని గుర్తుచేశారు. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించినప్పటికీ, వారి ఆందోళనను అణిచివేసిందని ఆరోపించారు. అదే తరహాలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విషయంలోనూ ప్రభుత్వ వైఖరి వివాదాస్పదంగా మారిందన్నారు. అక్కడ దాదాపు 400 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాయని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా తీసుకుని జోక్యం చేసుకున్న తర్వాతే ప్రభుత్వాలు స్పందించాయని అన్నారు. అప్పటివరకు విద్యార్థులు, ప్రజలు చేసిన విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు.ఇప్పుడు ఉర్దూ వర్సిటీ భూములపై కూడా అదే విధమైన చర్యలు చేపడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. విద్యా సంస్థల భూములను రియల్ ఎస్టేట్ అవసరాల కోసం లాక్కోవడం అన్యాయమని, ఇది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమేనని వ్యాఖ్యానించారు. ఉర్దూ వర్సిటీకి సంబంధించిన భూములపై ప్రభుత్వం జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయపోరాటం, ప్రజా ఉద్యమం రెండింటినీ చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు.




## డీజీపీ హైకోర్టులో ఊరట

**మొదటిపేజీ తరువాయి**

హైకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం డీజీపీ నియామక ప్రక్రియ చేపట్టలేదని, నిబంధనలకు విరుద్ధంగా శివధర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓను రద్దు చేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. డీజీపీ పదవీ విరమణకు కనీసం మూడు నెలల ముందే యూపీఎస్సీకి అర్హులైన అధికారుల ప్యానెల్‌ను పంపాల్సి ఉంటుందని పిటిషనర్ వాదించారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఐదుగురు అధికారుల పేర్లతో కూడిన జాబితాను యూపీఎస్సీకి పంపుతూ వచ్చామని, అయితే కొన్ని అంశాలపై స్పష్టత కోరుతూ యూపీఎస్సీ ఆ జాబితాను తిరిగి పంపిందని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 31న మరోసారి ప్యానెల్‌ను పంపామని, అయితే సుప్రీంకోర్టు అనుమతి తీసుకోవాలని సూచిస్తూ యూపీఎస్సీ మళ్లీ జాబితాను తిరిగి పంపిందని ఏజీ వివరించారు. ఇప్పటికే పంపిన ప్యానెల్‌ను పరిగణనలోకి తీసుకునేలా యూపీఎస్సీని ఆదేశించాలని ఆయన కోర్టును కోరారు. ఇదే సమయంలో యూపీఎస్సీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిబంధనల ప్రకారం సకాలంలో డీజీపీ ప్యానెల్ లిస్ట్ అందలేదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాను తిరిగి పంపాల్సి వచ్చిందని తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్యానెల్‌ను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని యూపీఎస్సీని ఆదేశించింది. అలాగే పూర్తిస్థాయి డీజీపీ నియామకంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ క్రమంలో శివధర్ రెడ్డి నియామకాన్ని రద్దు చేయాలన్న మధ్యంతర అభ్యర్థనను తోసిపుచ్చుతూ తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.



# రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం

**మొదటిపేజీ తరువాయి**

ఆ మాటను ఇప్పుడు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు ఏర్పాటు చేసి ఈ నెల 11వ తేదీ వరకు రైతులకు పాసుపుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మార్వోలు, ఆర్డీవోలు సహా రెవెన్యూ సిబ్బంది అందరూ బాధ్యతతో, మనసుపెట్టి పని చేయాలని సూచించారు. వచ్చే నెలలో మరోసారి సర్వే నిర్వహించి అవసరమైన చోట్ల పాసుపుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు. ఒకసారి పాసుపుస్తకాలు ప్రింట్ అయితే ఇక ఎలాంటి తప్పులు లేకుండా ఉండాలన్నారు. భూములకు సంబంధించి మొత్తం 29 అంశాలపై ఫిర్యాదులు అందాయని, వాటన్నింటినీ పరిష్కరిస్తున్నామని సీఎం వెల్లడించారు. 22ఏ కేటగిరీ భూములపై వచ్చిన సమస్యలన్నీ కూడా పరిష్కార దశలో ఉన్నాయని చెప్పారు. రైతుల భూరికార్డులను బ్లాక్‌చైన్ సాంకేతికతలో భద్రపరుస్తామని, దీంతో భూకబ్జాలకు అవకాశం ఉండదని తెలిపారు. భూములు ఆక్రమించాలనుకునే వారు భయపడేలా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న చిన్న భూ వివాదాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కుటుంబసభ్యులు, బంధువులతో భూతగాదాలు పెట్టుకోవద్దన్నారు. కోర్టుల చుట్టూ తిరిగితే జీవితకాలం వృథా అవుతుందని హితవు పలికారు. రాజకీయంగా కూడా చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నరకాసురుడి పాలన మళ్లీ రాష్ట్రంలో రాకూడదని ప్రజలు కోరుకోవాలన్నారు. గోదావరి పుష్కరాలు మూడు సార్లు వచ్చినప్పుడు తానే ముఖ్యమంత్రిగా ఉండటం తన అదృష్టమని వ్యాఖ్యానించారు. సముద్రంలోకి వృథాగా వెళ్లిపోతున్న నీటిలో 300 టీఎంసీలను వినియోగించుకోగలిగితే రాష్ట్రంలో కరవే ఉండదన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతానికి శాశ్వతంగా నీటి సమస్య తీరుతుందని సీఎం తెలిపారు. పోలవరం నుంచి విశాఖ వరకు, అక్కడి నుంచి వంశధార వరకు నీటిని తరలించే ప్రణాళిక ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడబోమని స్పష్టం చేశారు. గొడవలు పెట్టుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. మన వద్ద నీరు మిగిలితే తెలంగాణ కూడా వినియోగించుకోవచ్చని చెప్పారు. శ్రీశైలంలో నీటిని పొదుపుగా ఉపయోగించి రాయలసీమకు తరలించే చర్యలు చేపడతామని చంద్రబాబు తెలిపారు.



## ముగిసిన తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు

**విజయవాడ ప్రజాస్వరం**

కలియుగ వైకుంఠం తిరుమలలో 10 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతంగా ముగిశాయి. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు సాగిన ఈ దర్శనాల్లో టీటీడీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. టీటీడీ కల్పించిన ఏర్పాట్లపై 93 శాతం భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024లో 6.83 లక్షల మంది, 2023లో 6.47 లక్షల మంది దర్శించుకోగా, ఈసారి ఆ సంఖ్య భారీగా పెరిగింది. ఈ 10 రోజుల్లో శ్రీవారి హుండీ ద్వారా రూ.41 కోట్ల ఆదాయం సమకూరింది. రికార్డు స్థాయిలో 44 లక్షల లడ్డూలు విక్రయించామని చైర్మన్ వివరించారు. గతేడాదితో పోలిస్తే ఇది 10 లక్షల లడ్డూలు అధికం. అన్నప్రసాదాల వితరణ కూడా 27 శాతం పెరిగినట్లు తెలిపారు. పక్కా ప్రణాళిక, ఏఐ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షించడం వల్లే అంచనాలకు మించి భక్తులకు దర్శనం కల్పించగలిగామని బీఆర్ నాయుడు పేర్కొన్నారు. కల్యాణకట్ట, పారిశుద్ధ్యం, వైద్య సేవలు భక్తులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయని చెప్పారు. 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల పండ్లతో చేసిన అద్భుత అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. "ఈ వైకుంఠ ద్వార దర్శనాలను శాంతియుతంగా విజయవంతం చేసిన భక్తులకు, అహర్నిశలు శ్రమించి మెరుగైన సేవలు అందించిన అధికారులు, సిబ్బంది మరియు సేవకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.



## జలవివాదాలు పరిష్కరించుకుందాం

**మొదటిపేజీ తరువాయి**

లేదని, దాంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వివాదాలను కోరుకోవడం లేదని, కేవలం సమస్యలకు పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తోందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాజకీయ లాభాలకంటే ప్రజల ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ముఖ్యమని చెప్పారు.తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పొరుగు రాష్ట్రాల సహకారం తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఏపీతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు... ఏ రాష్ట్రంతోనైనా తెలంగాణ వివాదాల బాట పట్టదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేస్తే తెలంగాణ ప్రభుత్వం పది అడుగులు ముందుకు వేయడానికి సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.

**ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ**

ప్రపంచ స్థాయి నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోందని సీఎం పేర్కొన్నారు. సుజెన్ మెడికేర్ వంటి పరిశ్రమలు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. పెట్టుబడిదారులకు లాభాలు వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు.ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీ పడేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం రాష్ట్రంలో ఉందని సీఎం రేవంత్ చెప్పారు. పెద్ద పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నవారు మన దేశానికే చెందినవారే అన్న విషయాన్ని గుర్తు చేస్తూ, తెలంగాణ భవిష్యత్తు మరింత బలంగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఈడీ తీరుపై దీదీ ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలోని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో మమతా బెనర్జీ స్వయంగా రోడ్డెక్కి నిరసనకు నాయకత్వం వహించారు. ఈడీ అధికారులు గురువారం ఉదయం ఏడు గంటల నుంచే కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ ప్రాంతంలో ఉన్న ఐప్యాక్ కార్యాలయంతో పాటు ఢిల్లీలోని నాలుగు ప్రాంగణాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. కొన్ని హవాలా లావాదేవీలు, నగదు వ్యవహారాలు ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ ద్వారా జరిగినట్లు నిర్దిష్ట ఆధారాలు ఉన్నాయని ఈడీ ప్రకటించింది. బొగ్గు స్మగ్లింగ్ రాకెట్‌తో సంబంధం ఉన్న ఒక హవాలా ఆపరేటర్ ద్వారా ఐప్యాక్‌కు చెందిన 'ఇండియన్ పీఏసీ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థకు కోట్ల రూపాయల్లో లావాదేవీలు జరిగినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. సోదాల విషయం తెలిసిన వెంటనే మమతా బెనర్జీ హుటాహుటిన ప్రతీక్ జైన్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈడీ చర్యలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడినవని, రాజ్యాంగ విరుద్ధమని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ప్రతిపక్షాలను భయపెట్టేందుకే కేంద్రం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. "మా పార్టీకి సంబంధించిన పత్రాలు, హార్డ్‌డిస్క్‌లను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులకు సంబంధించిన కీలక సమాచారం కూడా ఉంది. అందుకే వాటిని నేను వెనక్కి తీసుకువచ్చాను" అని మమతా బెనర్జీ వెల్లడించారు.

అయితే, మమతా బెనర్జీ చట్టబద్ధమైన దర్యాప్తును అడ్డుకున్నారని ఈడీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆమెతో పాటు రాష్ట్ర పోలీసులు కలిసి కీలక ఆధారాలను బలవంతంగా తమ అధీనంలోకి తీసుకున్నారని ఢిల్లీలోని ఈడీ కార్యాలయం పేర్కొంది. ఈ పరిణామాలపై ఇరు వర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యవహారంపై తక్షణ విచారణ చేపట్టాలని కలకత్తా హైకోర్టును ఈడీ కోరింది. అయితే ఇప్పటివరకు న్యాయస్థానం ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ మొత్తం వ్యవహారంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. చట్టబద్ధమైన పాలనకు పశ్చిమ బెంగాల్ అతీతమన్న భావనను మమతా బెనర్జీ చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. ప్రతి ఎన్నికల ముందు ఇలాంటి ఆందోళనలు, రాజకీయ నాటకాలు చేయడం ఆమెకు అలవాటేనని ఎద్దేవా చేసింది. ఈ ర్యాలీని ముందే ఊహించామని, దానిలో కొత్తదనం ఏమీ లేదని భాజపా వ్యాఖ్యానించింది.



# 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి భారీ షాక్
- భద్రతా బలగాల ముందు లొంగిపోయిన 63 మంది మావోయిస్టులు
- వీరిలో రూ.1.19 కోట్ల రివార్డులు ఉన్న 36 మంది
- 'పున మర్గం' ప్రచారంతోనే జనజీవన స్రవంతిలోకి
- లొంగిపోయిన వారిలో కీలక డివిజనల్ కమిటీ సభ్యులు

ఛత్తీస్‌గఢ్, ప్రజాస్వరం




ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం దంతెవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో 18 మంది మహిళలు సహా మొత్తం 63 మంది మావోయిస్టులు భద్రతా బలగాల ముందు లొంగిపోయారు. వీరిలో 36 మందిపై మొత్తం రూ.1.19 కోట్ల రివార్డు ఉండటం గమనార్హం. దంతెవాడ జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) కార్యాలయంలో ఈ లొంగుబాటు కార్యక్రమం జరిగింది. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేలా మావోయిస్టులను ప్రోత్సహించేందుకు దంతెవాడ పోలీసులు చేపట్టిన 'పున మర్గం' (పునరావాసం పునరుజ్జీవనం) ప్రచారమే ఈ భారీ లొంగుబాటుకు కారణమని అధికారులు తెలిపారు. డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ బలగాలు వీరిని లొంగిపోయేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయి. లొంగిపోయిన వారిలో దర్భా డివిజన్, దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, మాడ్ డివిజన్‌లతో పాటు ఒడిశాలో పనిచేసిన వారు కూడా ఉన్నారు. వీరిలో డివిజనల్ కమిటీ సభ్యులు (డీవీసీఎమ్) మోహన్ కడ్తీ, సుమిత్రా కడ్తీ, పీపుల్స్ పార్టీ కమిటీ సభ్యురాలు (పీపీసీఎమ్) హంగీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరిపై గతంలో అనేక దాడులు, హత్యలు, ఐఈడీ పేలుళ్లు, ఆస్తుల ధ్వంసం వంటి కేసులు నమోదై ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నక్సల్ పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన వారికి రూ. 50,000 తక్షణ సహాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు వివరించారు. ఈ లొంగుబాటు బస్తర్‌ను నక్సల్ రహిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాల్లో ఒక పెద్ద విజయమని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం పేర్కొన్నారు.









# అశోక్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో భారీ లోపాలు

- ఎంపీడీఓ అద్వైత అసంతృప్తి...

ఖానాపూర్ జనవరి 09, ప్రజాస్వరం

వరంగల్ ఖానాపూర్ మండలం అశోక్‌నగర్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలపై ఎంపీడీఓ అద్వైత నిర్వహించిన తాజా తనిఖీలో పాఠశాల నిర్వహణలో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయి. పాఠశాలలో విద్యార్థుల శిక్షణ, సౌకర్యాల పరిరక్షణలో అవసరమైన ప్రమాణాలు పాటించబడవని అధికారులు వెల్లడించారు. తనిఖీ ఫలితాల ప్రకారం, పాఠశాలలో అమలు చేయాల్సిన మధ్యాహ్న భోజన మెనూ అందించబడడంలో లోపం ఉంది. వంటశాల పరిసరాలు అపరిశుభ్రంగా, అస్తవ్యస్తంగా ఉండటంతో ఆరోగ్య సమస్యలు కలగవచ్చన్న ఆందోళన అధికారుల వద్ద వ్యక్తం అయింది.అదేవిధంగా, పురుషుల మరుగుదొడ్లు గత రెండు సంవత్సరాలుగా ఉపయోగంలో లేవని, మహిళల మరుగుదొడ్ల నిర్వహణ దారుణంగా ఉందని గుర్తించబడ్డది. పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలు కూడా చాలా ఉన్నాయి. ఇవి పాఠశాల విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. పాఠశాల మొత్తం పనితీరు అసంతృప్తికరంగా ఉందని ఎంపీడీఓ స్పష్టం చేశారు. ఈ అంశాలపై సంబంధిత శాఖాధికారులు తక్షణమే నివేదిక సమర్పించి, లోపాలను సరిదిద్దే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు పాఠశాల పరిస్థితులపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని మరియు విద్యార్థుల భవిష్యత్తును కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని కూడా హై లైట్ చేశారు. ఈ తనిఖీ ఫలితాలు పాఠశాల నిపుణులు, విద్యార్థి తల్లిదండ్రులు, స్థానిక కమ్యూనిటీకి పెద్ద ఆందోళనగా మారాయి. స్థానికులు పాఠశాల నిర్వహణలో తక్షణమే మార్పులు అవసరమని మద్దతు వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్నికలపై ఉన్న దృష్టి ప్రజల సమస్యలపై లేకపాయె

- మునిసిపల్ ఎన్నికల్లో ప్రలోభ పెట్టే అభ్యర్థులను ఓడించాలి
- కలిసొచ్చే వామపక్ష సామాజిక శక్తులతో కలిసి ఎంసిపిఐ(యు) పోటీ
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

వరంగల్ బ్యూరో జనవరి 09, ప్రజాస్వరం




మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోని పాలక పార్టీలు మున్సిపల్ ఎన్నికల ఓట్లు సీట్లు అధికారం కోసం మాత్రం ప్రత్యేక దృష్టి పెట్టి గెలవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమో పట్టణ ప్రజలు ఆలోచించాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. డబ్బులు ఇతర ప్రలోభాలతో ఓట్ల కోసం వచ్చే అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) ఎంసిపిఐ(యు) నర్సంపేట మున్సిపాలిటీ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ బండారి మల్లేష్ అధ్యక్షతన నర్సంపేటలోని ఓంకార్ భవన్ లో జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దారపు రమేష్ మాట్లాడుతూ పాలకుల విధానాలతో వ్యవసాయం దివాలా తీసి గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలస వస్తున్నారని ఈ గ్రామంలో పట్టణాల్లో జనాభా పెరిగిపోతుందని అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించి పట్టణ ప్రజలను ఆదుకోవడంలో పాలక పార్టీలు విఫలం అవుతున్నాయని, అందులో భాగంగా నర్సంపేట గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్గ్రేడ్ అయిన వార్డుల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ప్రభుత్వ అసైన్డ్ స్థలాల్లో పేదలు దశాబ్దాల తరబడి నివాసముంటున్న రెగ్యులరైజ్ చేయకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇంటి నిర్మాణ అనుమతులు ఇంటి నెంబర్లు కావాలంటే అనేక ఇబ్బందులు పెడుతున్నారని అండర్ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాలు పడితే చెరువులను తలపించేలా రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయని వందల కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం కేటాయించి ఖర్చు చేస్తున్నామని చెప్పుతున్న ఆచరణలో అవి ఎవరి జేబులు నిండుతున్నాయో అందరికీ తెలిసిందే అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరుగుతున్న వత్తాసు పలుకుతున్నారే తప్ప అడ్డుకునే పరిస్థితి లేదన్నారు. పైగా మాదన్నపేట నాగుర్లపల్లె ముతోజీపేట మహేశ్వరం రాజపల్లె మరికొన్ని గ్రామాలను విలీనం చేసి ఆయా గ్రామాల ఉనికిని ప్రశ్నార్థకం చేశారని, గ్రామీణ ఉపాధి హామీ పథకం వర్తించకుండా చేసి ఆయా గ్రామాల ఉపాధిని కొల్లగొట్టారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ విలువలు కలిగి నీతి నిజాయితీగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే అభ్యర్థులను గెలిపించుకుంటే తప్ప అభివృద్ధికి బాటలు పడవని ఆ దిశలో ఎం సి పి ఐ (యు) కృషి చేస్తున్నదని కలిసి వచ్చే వామపక్ష సామాజిక శక్తులతో కలిసి పని చేసేందుకు ప్రయత్నిస్తుందని లేకపోతే ఒంటరిగానైనా పార్టీ ప్రభావం ఉన్న ప్రతి చోట పోటీ చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగ సుధా పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి మాదన్నపేట మాజీ సర్పంచ్ కర్నే సాంబయ్య పట్టణ నాయకులు వీర్ల రాజు గడ్డం స్వరూప పుట్టపాక సునీత చామంతుల రతన్ పిట్టల యాకయ్య గడ్డం పవన్ బెజ్జంకి రాజేష్ విజయ రవి రమేష్ సదానందం పద్మ కుమారస్వామి తదితరులతో పాటు విలీన గ్రామాల, పట్టణ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇదేం దాడి

- మహిళా అధికారి క్యారెక్టర్ పై కథనాలా

హైదరాబాద్, ప్రజాస్వరం

రాజకీయ నేతలు రాజకీయ కుట్రల కోసం హద్దులు దాటిపోతూంటారు. ఇప్పటి వరకూ రాజకీయ నేతలు.. రాజకీయ నేతలపై కుట్రలు చేసుకుంటూ..తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ ఉంటారు. కానీ తెలంగాణలో ఇది మరో స్థాయికి దిగజారిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలేయడానికి.. ఓ మంత్రి అంటూ.. మరో ఐఏఎస్ అధికారిణి పేరును లింక్ పెట్టి తప్పుడు ప్రచారాలు ప్రారంభిస్తున్నారు. ఓ ఊరూపేరూ లేని చానల్ లో ఆ కథనాన్ని ప్రసారం చేయిస్తున్నారు. తర్వాత ఆ వీడియోను బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు పోస్టు చేసి.. ఆ మంత్రి ఎవరు.. ఆ ఐఏఎస్ అధికారి ఎవరూ అంటూ క్విజ్ ప్రోగ్రాం పెట్టి వైరల్ చేస్తున్నారు. రాజకీయ నేతలు తమపై బురద చల్లించుకోవడానికి.. ఎదుటి వారిపై చల్లడానికి రెడీగా ఉంటారు. కానీ ఈ విషయంలోకి మహిళా ఐఏఎస్ అధికారిని తీసుకు రావడమే అత్యంత వివాదాస్పదమైన అంశంగా మారింది.గౌరవప్రదమైన స్థానంలో ఉన్న మహిళా ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సోషల్ మీడియా తప్పుడు ప్రచారం, కొన్ని వార్తా సంస్థల తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక అధికారిణి వ్యక్తిత్వాన్ని హననం చేయడం ఆమె కుటుంబాన్ని ఈ వివాదంలోకి లాగడంపై పౌర సమాజం నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎటువంటి ఆధారాలు లేకుండా, కేవలం ఊహాగానాలతో ఆమె వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన ఆరోపణలు చేస్తున్నారు. పరోక్షంగా కాకుండా, దాదాపు నేరుగా ఆమెను ఉద్దేశిస్తూ చేస్తున్న వ్యాఖ్యలు జర్నలిజం విలువలకే మచ్చ తెచ్చేలా ఈ కథనాలు ఉంటున్నాయి.ఈ వివాదంలో బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్, ఆ పార్టీ మద్దతుదారులు, సోషల్ మీడియా కార్యకర్తలు సానుభూతి చూపిస్తున్నట్లుగా నటిస్తూ.. ట్వీట్లు చేస్తున్నారు. ఆ వీడియోను కావాలని వైరల్ చేస్తున్నారు. వారి ప్రమేయం ఉండ బట్టే వాటిని ఇలా వైరల్ చేస్తున్నారని అనుకోవచ్చు. ఒక ఉన్నత స్థాయి అధికారిణి ప్రతిష్టను దెబ్బతీసేలా అసభ్యకరమైన గాసిప్స్ను వీరు వ్యాప్తి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పైకి సానుభూతి చూపిస్తున్నట్లు నటిస్తూనే, లోలోపల అసత్య ప్రచారాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే వ్యూహాన్ని వీరు అమలు చేస్తున్నారు.రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి అనేక మార్గాలను అన్వేషించవచ్చు, కానీ ఒక మహిళా అధికారిణి వ్యక్తిత్వాన్ని హననం చేయడం, ఆమె క్యారెక్టర్‌ను తక్కువ చేసి చూపడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. కేవలం సదరు అధికారిణిని మాత్రమే కాకుండా, ఆమె కుటుంబాన్ని కూడా ఈ వివాదాల్లోకి లాగడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత ప్రతిష్టను మంటగలిపేలా జరుగుతున్న ఈ దాడులు సదరు అధికారిణి మానసిక ధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, ఇది వ్యవస్థకే ప్రమాదకరం. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మహిళా అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది.

# పురపోరుకు అంతా రెడీ



హైదరాబాద్, ప్రజాస్వరం

రాష్ట్రంలోమున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.సంక్రాంతి పండుగకు మూడు రోజులు ముందుగానే ప్రకటించే అవకాశం ఉంది. నేడు రాజకీయ పార్టీలతో తెలంగాణ ఎన్నికల అధికారి భేటీ కానున్నారక. స్థానిక సంస్థల ఏర్పాట్లపై ఎస్ఈసీ చర్చించనుంది. రాష్ట్రంలో 117 మున్సిపాలిటీలకు ఈనెల 20లోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని తెలిసింది. తెలంగాణలోని 117 మునిసిపాలిటీలు, 6 మునిసిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీని షెడ్యూల్ ప్రకారం సిద్ధంచేస్తోంది. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.మున్సిపాలిటీల్లో ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని, కార్యదర్శి మంద్ మకరంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లతో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎప్పుడైనా మున్సిపాలిటీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. ఇటీవల పంచాయతీ ఎన్నికలను మూడు దఫాలుగా సజావుగా నిర్వహించిన నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను కూడా మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారుఈనెల 12న అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని, 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ.. ఆ వెంటనే 'టీపోల్' సాఫ్ట్వేర్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు సూచించారు.. 16న ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించాలని మున్సిపల్ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. సంక్రాంతి పండగ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి ఫిబ్రవరి నెలాఖరుకు ఎన్నికలను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తుంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నేడు జరిగే ప్రజా ప్రతినిధుల సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశముంది.

## గోరు పెంచితే దరిద్రం అంటారు..
# నాకు అయితే అదృష్టం



- **గోగినేని చిన రామయ్య**

**పటాన్‌చెరు, జనవరి 09 (ప్రజా స్వరం) :**

నాలుగు సంవత్సరాలుగా తన వ్రేలుపై గోరును పెంచుకుంటూ వస్తున్నానని గోగినేని చిన రామయ్య తెలిపారు. గోరు పెంచుకోవడం తనకు అదృష్ట సూచకంగా మారిందని వెల్లడించారు. "కొంతమంది గోర్లు పెంచితే దరిద్రం అంటారని అంటారు. కానీ నాకు మాత్రం ఈ గోరు ద్వారా అదృష్టం, పరిచయాలు రెండూ పెరిగాయి" అని రామయ్య తెలిపారు. గత నాలుగేళ్లుగా క్రమంగా పెరుగుతున్న ఈ గోరును చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చిటికిన వేళ్ల గోరునే ఇలా పెంచడం తనకు ప్రత్యేక గుర్తింపుగా మారిందని పేర్కొన్నారు.

## కిష్టారెడ్డిపేట్‌ను జిహెచ్‌ఎంసి డివిజన్‌గా
# ఏర్పాటు చేయాలి



- **మంత్రికి అఖిలపక్ష నాయకుల వినతి**

**అమీన్ పూర్, జనవరి 09 (ప్రజా స్వరం) :**

పటాన్ చెరువు నియోజకవర్గంలోని అమీన్పూర్ మండల పరిధిలో ఉన్న ఎనిమిది గ్రామపంచాయతీలను కలుపుతూ కిష్టారెడ్డి పేట్ ను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం స్వీకరించిన మంత్రి సానుకూలంగా స్పందించారు. కిష్టారెడ్డిపేట్ ప్రాంత అభివృద్ధి దృష్ట్యా కచ్చితంగా కృష్ణారెడ్డిపేట్ జిహెచ్ఎంసి డివిజన్‌గా ఏర్పాటు చేసే దిశలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు కుర్ర సత్యనారాయణ, అమీన్పూర్ మండల అఖిలపక్ష నాయకులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముప్పిరెడ్డిపల్లి పాఠశాలలో
# ఫుడ్ ఫెస్టివల్



**మనోహరాబాద్, (ప్రజాస్వరం) :**

మనోహరబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు నాగిరెడ్డి తోటి ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఫుడ్ ఫెస్టివల్ నివేదించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి కందల రాజనర్సింహ ఉప సర్పంచి రామ్ రెడ్డి పాలకవర్గ సభ్యులు సాదు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు చేసిన రకరకాల ఆహారాలను తిని వారిని అభినాదించారు.

## జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలో మోక్షరెడ్డి ప్రతిభ



**తూప్రాన్ జనవరి 9 ప్రజాస్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పోతురాజు పల్లి వద్ద గల ఒలింపియా స్కూల్ విద్యార్థిని మోక్ష రెడ్డి జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీ లో ప్రతిభ కనబరిచారు పాఠశాల ప్రిన్సిపల్ యజమాన్యం కోచ్ లు అభినందించారు జనవరి 4 నుండి 6 వరకు ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్‌లో జరిగిన ఈ టోర్నీలో ఆమె తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. మోక్షరెడ్డి నాయకత్వంలో తెలంగాణ జట్టు జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు ఈ విజయంతో రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామస్తులు, క్రీడాభిమానులు ఆమెను అభినందనలతో ముంచెత్తారు కోచ్ లు అసిఫ్. మధు లు అభినందనించారు.



## ప్రగతి పాఠశాలలో
# ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**ఆదిలాబాద్ జిల్లా జనవరి 09 (ప్రజాస్వరం):**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని స్థానిక ప్రగతి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు వంటకాలు ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రతియేటా విభిన్న కార్యక్రమాలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో భాగంగా ఈ సంవత్సరం ఫుడ్ ఫెస్టివల్‌ను చిన్నారులు నోరూరించే రుచులతో వంటలు చేశారు. తల్లిదండ్రుల సహకారంతో చేసిన ఈ వంటకాలను దాదాపు వంద రకాల పిండి వంటలు స్కూల్‌లో ప్రదర్శించగా.టీచర్లు వారిని అభినందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సూత్రాలను తెలియజేసేందుకు ఈ ఫెస్ట్ దోహదపడిరదని స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఇచ్చోడా మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జెలై జకు ఉపసర్పంచ్ లోక శిరీష్ రెడ్డి,మాజీ ఎంపిపి నిమ్మల ప్రితం రెడ్డి మాజీ ఎంపిటిసి నిమ్మల శివారెడ్డి హాజరుయ్యారు వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాల పట్ల పిల్లలకు అవగాహనా ఈ కార్యక్రమం తోడ్పదుతుందని అన్నారు. చదువు, విలువలతో పాటు ప్రతియేటా ఏదొక శాస్త్రీయ దృక్పథంతో కూడిన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విద్యార్థులను చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నారాని వాటికీ టీచర్లు, సిబ్బంది సహకారం కూడా ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి శ్రీ సురకంటి వనమాల వెంకట్ రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్ కాసారం ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ ఏనుగు మంజుల, నిజాముద్దీన్, రాధ, కావేరి, ఆసన, సునీత, నందిని, కావేరి, లాస్య, రమ్య,గంగోత్రి, అక్షయా, సృజన, లక్ష్మీ,సంజన,సవిత,రచన, స్వాతి,రాజు, పాఠశాల పి ఈ టి అల్లం సాయికిరణ్ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.








# గీతా స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**తూప్రాన్, జనవరి 9 (ప్రజాస్వరం) :**

తూప్రాన్‌లోని గీతా స్కూల్లో సంక్రాంత్రి పండుగా వేడుకలు విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు వేకువ ఝామునే అరుణారుణ కాంతులతో మెరిసిపోతున్న ఆకాశం తన వెచ్చని కిరణాలతో భూమిని ప్రసరించి సంక్రాంతి వేడుకలకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా రంగుల రంగవల్లులు పలు రంగుల్లో మెరిసి పోతుండగా... హరిదాసులు,బుడబుక్కల వాళ్ళు,సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థుల నృత్యాలు వెరసి గీతా స్కూల్ ప్రాంగణం సంక్రాంతి సందళ్లతో అలరించింది. ముఖ్యంగా గోదాదేవి రంగనాయకుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ ఉష విద్యార్థులకు తలంబ్రాలు పోసి ఆశీర్వదించారు.గోదాదేవి,రంగనాయకుల కల్యాణ ఘట్టం ఆకర్షణీయంగా నిలిచింది.పండుగ సంస్కృతి సంప్రదాయాలను ఉపాధ్యాయురాలు రమాదేవి వివరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ..సంక్రాంతి పండుగ తెలుగు లోగిళ్లలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు భరత్, మౌనిక, ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ర్యాలీ

**తూప్రాన్, జనవరి 9 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులచే స్వామి వివేకానంద 163వ జయంతి పురస్కరించుకొనిశుక్రవారం ర్యాలీ నిర్వహించారు అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర కేలో భారత్ కో కన్వీనర్ బండారి ప్రశాంత్ మాట్లాడుతూ భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయము చేసిన ఖ్యాతి అతనికి ఉంది. గురువు గారి కోరిక మేరకు అమెరికాకు వెళ్ళి ఎన్నో ఉపన్యాసాలు చేశాడు. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. అతని వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ప్రతి ఒక్క విద్యార్థి మహనీయుని బాటలో నడవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్ లోకేష్ మణిదీప్ అభిషేక్ హర్షవర్ధన్ మనుతేజ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు



# సీఎంఆర్ చెక్కులు పంపిణీ



- **మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

**గజ్వేల్ జనవరి 09 ప్రజాస్వరం :**

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అహ్మదిపూర్ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ డాక్టర్ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గార్ల సహకారంతో మంజూరు అయిన చెక్కులను ఈరోజు గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ లబ్ధిదారులకు సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్ తో కలిసి అందచేశారు. వారిలో చాడ కిష్టమ్మ 13500, కుంటా మాధవరెడ్డి 21000, కుంట్రంగల కవిత 33000,చాకలి పెంటకడి బాల్ రాజు 13500 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదస్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ఆధ్వర్యంలో పేద ప్రజల హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి చెక్కులు అందజెయడం జరిగిందన్నారు. అధికారం ఉన్న లేకున్నా పేద ప్రజల కష్టసుఖాలను ఎల్లప్పుడూ ముందుంటామని ప్రభుత్వం నుంచి వచ్చే సీఎం సహాయ నిధి చెక్కులు కళ్యాణ లక్ష్మి చెక్కులు వంటి సంక్షేమ కార్యక్రమాలను మేము స్పందించి బీఆర్ఎస్ పక్షాన మేము ప్రజలకు వారధిలాగా పనిచేస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం పోల్చుకుంటే ఈ ప్రభుత్వం తక్కువ ఇవ్వడం జరుగుతుందని ఇప్పటికైనా ఆలోచించి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ తక్కువ ఇస్తునందున సీఎం సహా నిధి పెంచాలని కోరుతున్నాం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కుడా బలోపేతం చేయడం వలన పేద ప్రజలకు హాస్పిటల్ ఖర్చు తగ్గుతాయని తెలిపారు. ఏ ప్రభుత్వము వచ్చిన ప్రజలకు నమ్మకంగా ఉండాలని ఒక భరోసా కల్పించాలని నిరుపేదల కళ్ళల్లో సంతోషం చూసినప్పుడే ఆ ప్రభుత్వానికి విలువ ఉంటుందని తెలిపారు. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారని రాష్ట్రంలో ప్రజలు అన్ని రంగాల్లో ఎన్నో అవస్థలు పడుతున్నారని అన్నారు. ముందుగా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చాలని ఈ సందర్భంగా ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో pacs మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో అప్షన్ అహ్మద్,గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్, మాజీ సర్పంచ్ ఆగయ్య, వార్డు మెంబర్స్ రజిత, మంజుల,ఎర్ర రాజు, స్రవంతి వెంకటేష్, క్యామీడ్రి రాములు, మహిపాల్ రెడ్డి, సిద్ధోల్లా రాములు, నాయకులు, కుంట కిష్టారెడ్డి, బ్యాగారి స్వామి, రామలు గౌడ్, ముత్యం గౌడ్, సకలి శ్రీనివాస్, మంద నరేష్,మంద యాదగిరి, బీమా రమేష్, జగన్ గౌడ్, కర్నాకర్, కనకయ్య, నర్సింహారెడ్డి, అదెపు శ్రీను, మధు, సంజీవ రెడ్డి, గురిమూర్తి, కర్నాకర్ రెడ్డి,భవాని లింగం, ఎల్లయ్య, శ్రీనివాస్, సాకలి కిష్టయ్య యాదయ్య,బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

- **తీన్మార్ మల్లన్న వ్యక్తి కాదు బీసీ ఉద్యమ శక్తి**
- **టిఆర్పి జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి కురుమ**

**గజ్వేల్, జనవరి 09 (ప్రజాస్వరం) :**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై జాగృతి అధ్యక్షురాలు కవిత అనుచరులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి కురుమ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో టిఆర్పి జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు తుప్పది శ్వేత లతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం ఏర్పాటు చేసే దిశగా తీర్మానం మల్లన్న ఉద్యమం చేస్తున్నాడని, అలాంటి వ్యక్తిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అనుచరులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎలాంటిదో ప్రజలందరికీ తెలుసని, కెసిఆర్ కవితను కుటుంబం నుంచి ఎందుకు వేలేశారో అందరికీ తెలుసని అన్నారు. తీన్మార్ మల్లన్న అంటే ఒక వ్యక్తి కాదని బిసి ఉద్యమ శక్తి అని, అగ్రవర్ణ రాజకీయాలకు చెక్ పెట్టి దిశగా మల్లన్న అడుగులు వేయడం అగ్రవర్ణ రాజకీయ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని, అందుకే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారం రావాలని ఉద్దేశంతో తీన్మార్ మల్లన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించడం జరిగిందని, పార్టీలో వేలాది చేరికలు రాష్ట్ర నలు మూలల నుంచి ఉప్పొంగుతున్న బీసీ చైతన్యాన్ని ఇక ఎవరు ఆపలేరని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బహుజనులకు రాజకీయాల్లో నిజమైన ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, మల్లన్న వెనుక ఈరోజు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలు అందరూ ఏకమై ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగ ఉపాధ్యక్షుడు మల్కి సంపత్ కుమార్, మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ బాబా, పరశురాము తదితరులు పాల్గొన్నారు.



# నూతన పాఠశాల భవనానికి భూమి పూజ

- **జబ్బాపూర్ సర్పంచ్ వెంకటేష్**

**గజ్వేల్ /వర్గల్ జనవరి 09 (ప్రజాస్వరం) :**

వర్గల్ మండలం జబ్బపూర్ గ్రామంలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో ముగ్గు పోశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండలంలోనే ఆదర్శ పాఠశాలగా జబ్బపూర్ పాఠశాలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల భవనానికి ఈడబ్ల్యూఎస్ నిధులు రూ 63 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదివి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజ్, వార్డు సభ్యులు మరియు ఏఈ అరవింద్, గ్రామస్తులు యాదగిరి, కన్నయ్య, సాంబ, సుందర్,సురేష్, ప్రభాకర్,స్వామి, సుదర్శన్,నవీన్ తదితరులు పాల్గొన్నారు

# జోనల్ కమిషనర్‌ను కలిసిన కాట సుధాశ్రీనివాస్



**అమీన్ పూర్, జనవరి 09(ప్రజా స్వరం) :**

జిహెచ్ఎంసి శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్‌ను సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. బీరంగూడ (270), అమీన్‌పూర్ (271) డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల అభివృద్ధి, డ్రైనేజ్ సమస్యలు, త్రాగు నీటి సరఫరా, వర్షపు నీటి నిర్వహణ, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై చర్చ జరిగింది. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు.ఈ కార్యక్రమం లో అమీన్ పూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శశిధర్ రెడ్డి, సుధాకర్ యాదవ్,మన్నే రవీందర్, మున్నా, బిక్షపతి, గోపాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం అత్తను చంపిన అల్లుడు



- **మీడియా సమావేశంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు**

**గజ్వేల్ / కొండపాక, జనవరి 09 (ప్రజాస్వరం) :**

ఆస్తి కోసం సొంత అల్లుడే అత్తను చంపిన ఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డి పల్లిలో చోటుచేసుకుంది.సిద్ధి పేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డి పలికి చెందిన రాములమ్మ రాజీవ్ రహదారి పక్కన హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తుంది. రాములమ్మ తన కూతురుకి ములుగు మండలం తునికిబొల్లారం గ్రామానికి చెందిన జీవన్ రెడ్డితో వివాహం జరిపించిందని కుకునూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు తెలిపారు. రాములమ్మ పేరిట ఉన్న రెండెకరాల భూమి కోసం చిన్నల్లుడు జీవన్ రెడ్డితో తరచూ గొడవలు జరుగుతుండేవి కాగా తాను చనిపోయిన తర్వాత భూమిని తీసుకోండి అని రాములమ్మ అల్లుడితో తేల్చి చెప్పినట్లుగా తెలిసింది. అదేకాక కరోనా సమయంలో జీవన్ రెడ్డి ఉద్యోగం కోల్పోయి ఆర్థికంగా చికితిల పడ్డాడు. ఇక అత్త భూమినే నా సమస్యలు తీరుస్తుంది అని జీవన్ రెడ్డి భావించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న అల్లుడు మొదట రాములమ్మ ఉంటున్న నివాసాన్నికి నిప్పు పెట్టాడు. అందులో నుండి రాములమ్మ రక్షింపబడింది. అయితే ఎవరో లారీ డ్రైవర్లు తగులబెట్టారని అనుకునేలా చేశాడు జీవన్ రెడ్డి. ఇక అప్పుడు జీవన్ రెడ్డి మీద ఎవరికి అనుమానం రాలేదు. అయితే ఎలాగైనా చంపాలని తలిచిన నిందితుడు మంగళవారం రోజున పథకం ప్రకారం తనతో మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి అత్తవారి ఇంటికి ముందు ద్వారం ద్వారా వెళ్ళాడు. అక్కడే చాయి త్రాగి ముందు డోర్ ను మూసివేసి రాములమ్మను టవల్ మెడకు బిగించి హత్య చేసి వెనుకాల డోర్ నుండి నిందితుడు జీవన్ రెడ్డి, తనతో వచ్చిన వ్యక్తులు పరారైనట్లుగా ఏసిపి తెలిపారు. అయితే నిందితుడు వెనకాల నుండి వెళ్ళిపోయిన విషయం సీసీ టీవీలో రికార్డ్ అయ్యింది. తనతో వచ్చిన వారి చెప్పులను , హెల్మెట్ ను సైతం గుమ్మం ముందే వదిలి వెళ్ళాడని ఏసిపి నర్సింలు తెలిపారు.అయితే హత్యకు సహకరించిన వారితో పాటు మొత్తం ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ చేస్తున్నట్లుగా ఏసిపి అన్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు



**నార్సింగి, జనవరి 09 ( ప్రజా స్వరం ) :**

నార్సింగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబురాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించారు. మండల విద్యాధికారి గంగా బాయి ముఖ్య అతిథిగా హాజరైన ఈ సంబరాలలో విద్యార్థులతో ముగ్గుల పోటీలు, భోగి మంటలు, పతంగుల ఎగురవేత తో పాటు సంప్రదాయ నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగా బాయి మాట్లాడుతూ విద్యార్థులలో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పై అవగాహన పెంచేలా ఈ కార్యక్రమాలు నిలిచాయని అన్నారు. విద్యార్థులకు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని, సంక్రాంతి ఉత్సవాలు ప్రతీ ఒక్కరిలో ఉత్సాహం, ఐక్యత ను నింపాలని గంగా బాయి ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పండుగ సంప్రదాయాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.సంక్రాంతి సంబరాలలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రవి చందర్, ఉపాధ్యాయులు రామ కృష్ణ, పూర్ణ చందర్, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించిన ఎస్సై నారాయణ గౌడ్



**చిన్న శంకరంపేట, జనవరి 9 (ప్రజాస్వరం):**

చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామంలో చందంపేట క్రికెట్ లీగ్ క్రికెట్ మ్యాచ్ ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై నారాయణగౌడ్ హాజరై జ్యోతి ప్రజలను చేసి పోటీలను ప్రారంభించారు, మొదటి బహుమతి ట్రోఫీతో పాటు 30 వేల రూపాయల నగదు రెండో బహుమతి ట్రోఫీతో పాటు 20 వేల నగదు అందించనున్నారు, సుమారు పది టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు, ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ కుమార్ మాజీ ఎంపిటిసి శివకుమార్ ఎస్సై నారాయణ గౌడ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఎలాంటి గొడవలకు తావివ్వకుండా స్నేహ సంబంధాలతో క్రీడలలో పాల్గొనాలని వారు తెలిపారు, క్రీడలలో గెలుపు ఓటములు సహజమని నేటి ఓటమి రేపు గెలుపుకు నాందిగా తీసుకొని క్రీడా స్ఫూర్తితో ఆడాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణ గౌడ్, సర్పంచ్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మ, పాలకవర్గ సభ్యులతో పాటు స్వామి రాజ్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వరం

- **ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు,జనవరి 09 (ప్రజా స్వరం) :**

పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరంగా మారాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమీన్పూర్, రామచంద్రపురం, గుమ్మడిదల, జిన్నారం, పటాన్చెరు రెవెన్యూ మండలాలకు చెందిన 194 మంది లబ్ధిదారులకు పథకాల ద్వారా మంజూరైన మొత్తం ₹1 కోటి 94 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, అర్హులైన ప్రతి ఒక్కరికి దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పటాన్చెరు నియోజకవర్గంలో సుపరిపాలన లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు కొండంత ఆసరాగా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు రాజు, వెంకటేష్, ఇమ్రాన్, ఆయా మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలను సందర్శించిన తహసిల్దార్ గ్రేస్ బాయి





**నార్సింగి, జనవరి 09 ( ప్రజా స్వరం ) :**

తహసీల్దార్ గ్రేస్ బాయి శుక్రవారం మండలం లోని పలు పాఠశాల లను సందర్శించి విద్యార్థులకు అవసరమైన ధృవ పత్రాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గ్రేస్ బాయి మాట్లాడుతూ కలెక్టర్ రాహుల్ రాజ్, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రా రెడ్డి ఆదేశాల మేరకు నార్సింగి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భీం రావు పల్లి లోని ప్రాథమిక పాఠశాల ను సందర్శించి, ధృవ పత్రాల కోసం దరఖాస్తులను తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు అవసరమయ్యే ధృవీకరణ పత్రాల కోసం వారి విలువైన సమయం వృథా కాకుండా, చదువుల పై పూర్తి దృష్టి పెట్టాలన్న కలెక్టర్ రాహుల్ రాజ్ మంచి ఆలోచన అమలు లో భాగంగా విద్యార్థుల వద్దకు తామే స్వయంగా వెళ్ళి దరఖాస్తులను తీసుకున్నామని తెలిపారు. పాఠశాలల సందర్శన లో భీం రావు పల్లి పాఠశాల లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కు పై చదువుల కోసం కావలసిన కుల, ఆదాయ, నివాస ధృవ పత్రాల కోసం దరఖాస్తులను, పాఠశాల లో విద్యను అభ్యసిస్తున్న కొందరు విద్యార్థుల జనన ధృవీకరణ పత్రాలలో మార్పులు చేయాల్సి ఉందని అక్కడి ఉపాధ్యాయులు తెలుపగా వారి వద్ద నుంచి కూడా దరఖాస్తులను స్వీకరించామని అన్నారు. నార్సింగి లోని ఉన్నత పాఠశాల లోని 10 వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి అవసరమున్న 30 వరకు కుల, ఆదాయ, నివాస ధృవ పత్రాల కోసం దరఖాస్తులను తీసుకున్నామని అన్నారు. ప్రభుత్వం తరపున విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, ఇతర వసతుల ను పర్యవేక్షించామని అన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యత, సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు బోర్డు పరీక్షల కోసం సన్నద్ధం కావాలని, ఇష్టంగా చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించామని అన్నారు. పాఠశాలల సందర్శనలో ఆర్.ఐ శ్రీధర్, మేఘన, జీపీఓ వైష్ణవి పాల్గొన్నారు.



# నిందితులను అరెస్ట్ చేయాలి

**దౌల్తాబాద్ జనవరి 9 (ప్రజాస్వరం ) :**

రాయపోల్ మండలం అనాజీపూర్‌లో దళితుల పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ తీవ్రంగా ప్రశ్నించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్‌తో పాటు గజ్వేల్ ఏసీపీని ఆయన నిలదీశారు. ఈ సందర్భంగా స్పందించిన పోలీస్ కమిషనర్ నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని హామీ ఇచ్చి, మొత్తం కేసు ఫైల్ తీసుకొని రావాలని ఏసీపీకి ఆదేశించారు. అలాగే రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఏసీపీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా రాయపోల్ మండలం వడ్డేపల్లి, ములుగు మండలం క్షీరసాగర్, వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామాల్లో దళితులకు జరిగిన నష్టానికి తగిన పరిహారం అందించాలని కమిషన్‌ను కోరారు. రాయపోల్ మండలం చిన్న మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన దళితురాలు భాగ్యకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి మొదటి బిల్లు ఇచ్చి, రెండవ బిల్లు నిలిపివేయడంపై చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే బిల్లు చెల్లించాలని ఏపిడిఓ శ్రీనివాస్‌ను చైర్మన్ ఆదేశించారు. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్‌లో దళితుల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్న మాజీ సర్పంచ్ పై కేసు నమోదు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నేతలు ఎగొండ స్వామి, జిల్లా కార్యదర్శి వేణు, భీమ్ శేఖర్, పొతరాజు శంకర్, బెజ్జంకి తిరుపతి, బాధితులు యాదగిరి, దివాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఆనంద్

**దౌల్తాబాద్ జనవరి 9(ప్రజాస్వరం) :**



మండలంలోని దొమ్మాట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు దేవిగారి ఆనంద్ కి అరుదైన అవకాశం లభించింది. జనం 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని ఇతర ప్రముఖుల సమక్షంలో జరగనున్న వేడుకల్లో అతను డప్పు ప్రదర్శన ఇవ్వనున్నాడు. ఈ అవకాశానికి కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని నాగపూర్ సౌత్ సెంట్రల్ కల్చర్ జోన్ నుండి ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత భాస్కర్ గారి నేతృత్వంలో ఆహ్వానం అందింది. తెలంగాణ నుంచి ఎన్నికైన ఏకైక కళాకారుడైన ఆనంద్ కి తన గ్రామస్థులంతా హర్షం వ్యక్తం చేశారు.



# సిద్దిపేట సీపీని కలిసిన దౌల్తాబాద్ ఎస్సై అరుణ్

**దౌల్తాబాద్, జనవరి 9 (ప్రజా స్వరం):**

సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాధన రష్మీ పెరుమాళ్ ను దౌల్తాబాద్ ఎస్సై గంగాధర అరుణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందజేశారు.పోలీసు శాఖలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, నేర నియంత్రణలో సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. దౌల్తాబాద్ మండల పరిధిలో పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ చట్ట వ్యవస్థలను పటిష్టం చేయడంపై ఎస్సై గంగాధర అరుణ్ కుమార్ సీపీకి వివరించారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ, పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా పనిచేయాలని ఈ సందర్భంగా సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం లభ్యం

**నార్సింగి, జనవరి 9 (ప్రజా స్వరం) :**

మండల పరిధిలోని వల్లూరు వద్ద జాతీయ రహదారి 44 పై గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. స్థానిక ఎస్సై సృజన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం వల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజి రెడ్డి కు అదే గ్రామానికి చెందిన ఎల్లబోయిన సురేష్ ఫోన్ చేసి వల్లూరు వద్ద జాతీయ రహదారి 44 పై ఉన్న హెచ్పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని తెలిపాడు. అంజి రెడ్డి వెళ్ళి చూసి పోలీసులకు సమాచారం అందించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది, చుట్టు పక్కల వారిని మృతుని గురించి వాకబు చేయగా మృతుడు గత రెండు నెలల నుంచి మతిస్థిమితం లేకుండా చుట్టు పక్కల తిరుగుతూ దాబాలలో పెట్టిన అన్నం తింటూ, రోడ్డు పక్కన పడుకునే వాడని తెలిసింది. మృతుని వయస్సు 60 70 సం ఉండి, బూడిద రంగు టీ షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, షర్టు పై "డెనిమ్ సిన్స్ 98" అని, ప్యాంట్ పై "క్లీమాకోల్" అని ఉందని, తెల్లని పెరిగిన గడ్డం, మీసాలు తల పై జుట్టు ఉందని, ఎడమ చేతి పై పుట్టు మచ్చ ఉన్నట్లు తెలిపారు. మృతుడికి మతిస్థిమితం లేక, సరిగ్గా తినడానికి దొరకక అనారోగ్యంతో మరణించినట్లు తెలుస్తుందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెల్సిన వారు నార్సింగి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని కోరారు.

# పాలకవర్గానికి సన్మానం



**గజ్వేల్ / కొండపాక , జనవరి 09 (ప్రజాస్వరం) :**

కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కొండపాక మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ కొయ్యడ వెంకటేశం తో పాటు వార్డ్ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధి తో పాటు, పాఠశాల అభివృద్ధి కొరకు సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కొరకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసన్నమని, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నవిత, వార్డు సభ్యులు జ్యోతి సంజీవ్, గద్దె రాజు, తుమ్మ స్వాతి, కుమ్మరి ఎల్లం, తుమ్మ నాగయ్య, వడ్ల సుజాత, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# మాచిన్‌పల్లి రోడ్లకు తాత్కాలిక ఉపశమనం

**దౌల్తాబాద్ జనవరి 9 (ప్రజాస్వరం ):**

మండల పరిధిలోని మాచిన్‌పల్లి గ్రామంలో రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ బొక్కల నాగరాజు చొరవ తీసుకుని గుంతలను కంకర డస్ట్‌తో పూడ్చివేశారు. తాత్కాలికంగా అయినప్పటికీ ప్రజలకు ఉపశమనం కలిగేలా కంకర డస్ట్‌తో గుంతలను పూడ్చివేయించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవిత, వార్డు సభ్యులు మంజుల, దినకర్, శివలింగం, నవీన్, ప్రభాకర్, మల్లేశం, నర్సవ్వ, స్వామి, నరబోయిన పద్మ పాల్గొన్నారు.

# సర్పంచులకు సన్మానం



- **గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి**
- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**

**గజ్వేల్, జనవరి 09 (ప్రజస్వరం) :**

కుకునూరుపల్లి మండలం నూతనంగా గెలిచిన సర్పంచులు ఉపసర్పంచులను మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఆకుల భద్రప్ప ఆధ్వర్యంలో తన్నీరు హరీష్ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప ఉప సర్పంచులును ఆత్మీయంగా పలకరిస్తూ గజ్వేల్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి తో కలిసి సన్మానించి మాట్లాడుతూ నూతన కుకునూరుపల్లి మండలాన్ని కేసీఆర్ ఇచ్చినందుకు కృతజ్ఞతగా మండల ప్రజల ఆశీర్వాదంతో మెజారిటీ గ్రామాలు గెలుపొందడం సంతోషం సర్పంచ్లుగా గెలిచిన వాళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. మీ గ్రామాల అభివృద్ధి కోసం పనిచేస్తూ ప్రజలలో మంచి పేరు సంపాదించాలి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం కార్యనిర్వాహణ అధ్యక్షులు దేవి రవీందర్ పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ అమరేందర్, కోల సద్గుణ రవీందర్, సర్పంచులు సున్నం సుదర్శన్, మధుమోహన్, సంపత్ యాదవ్,రమేష్ గౌడ్, శ్రీలత మైపాల్, శిల్పా నర్సింలు కర్ణాకర్. కనకవ్వ ఐలయ్య. రేణుక భగవంతు రాధిక శ్రీనివాస్ .. మాజీ సర్పంచులు బచ్చలి మహిపాల్ కోల శ్రీనివాస్ రెడ్డబోయిన కనకయ్య టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



**దౌల్తాబాద్, జనవరి 9 (ప్రజాస్వరం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని 2026 సంక్రాంతి వేడుకలను శ్రీ వైష్ణవి పాఠశాల లో విద్యార్థులు, అధ్యాపకుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జనవరి 10 నుంచి 18 వరకు అధికారిక సంక్రాంతి సెలవులకు ముందుగా ఈ వేడుకలు నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను రంగురంగుల ముగ్గులతో అలంకరించగా, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భోగి మంటలు, గొబ్బెమ్మల ప్రదర్శన, పాటలు, నృత్యాలు వంటి కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను తెలియజేసేలా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, మేనేజ్‌మెంట్ చైర్మన్ విజయ్‌కుమార్, ప్రతినిధి మధుసూధన్ రావు నాయకత్వం వహించారు. వారు మాట్లాడుతూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాలపై గౌరవం, ఐక్యత భావన, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు.తెలంగాణ వ్యాప్తంగా అనేక పాఠశాలలు 2026 జనవరి తొలి వారంలో సంక్రాంతి సెలవులకు ముందు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తూ తెలుగు సంస్కృతి వైభవాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



# రాయపోల్ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

**దౌల్తాబాద్, జనవరి 9 (ప్రజాస్వరం) :**

గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా రాయపోల్ మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బేగంపేట, వడ్డేపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను రంగురంగుల ముగ్గులతో అలంకరించగా, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భోగి మంటలు, గొబ్బెమ్మల ప్రదర్శన, గాలిపటాల ఎగరవేత వంటి కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ పాటలు, నృత్యాలు, నాటికలతో అందరినీ అలరించారు. ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ వెనుక ఉన్న వ్యవసాయ ప్రాధాన్యత, ఐక్యత సందేశాన్ని విద్యార్థులకు వివరించారు. పండుగలు మన సంస్కృతిని తెలుసుకునేందుకు, సామాజిక విలువలు పెంపొందించేందుకు దోహదపడతాయని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సంప్రదాయాల పై గౌరవం పెంచేలా ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. చివరగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని ఆనందంగా ముగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, రజని, సుధాకర్, వరప్రసాద్, ఇంద్రసేనారెడ్డి, మోహన్, రాజయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999